క్లుప్తంగా

నిరుపేదలకు ఇళ్లు కేటాయించాలి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న బాధితులు

సిరిసిల్లటౌన్: పట్టణంలో సొంతిల్లుకై ఎదురు చూస్తున్న నిరుపేదల డబుల్ బెడ్రూం గోడు తీర్చాలని సీపీఎం నాయకులు ఆర్డీవో టి.శ్రీనివాస్‌రావును కోరారు. ఈమేరకు సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, కమిషనర్ వెల్దండి సమ్మయ్య, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి సమక్షంలో వారు ఆర్డీవోను కలిసి మాట్లాడారు. డ్రాలో పేర్లు రాని అర్హులకు సారంపెల్లి వద్ద నివేశన స్థలాలు పదిహేను రోజుల్లో అందిస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు. నాయకులు రమణ, మూశం రమేశ్, ఎల్లారెడ్డి, పద్మ, అజయ్, రమేశ్ పాల్గొన్నారు.

సిద్దిపేటలో సిరిసిల్ల కవికి సత్కారం



దేవానందంను సత్కరిస్తున్న మంత్రి హరీశ్‌రావు

సిరిసిల్లకల్చరల్: పట్టణంలో మానేరు రచయితల సంఘం ఉపాధ్యక్షుడు బూర దేవానందం రాష్ట్ర ఆర్థిక మంత్రి తన్నీరు హరీశ్‌రావు చేతుల మీదుగా సత్కారం అందుకున్నారు. రంగనాయక రచయితల సంఘం వారు రూపొందించిన అమృత వర్షిణి కవితా సంకలనం ఆవిష్కరణోత్సవం ఆదివారం జరిగింది. ఈ సంకలనంలో దేవానందం కవిత అచ్చయింది. ఈ సందర్భంగా మారసం కవులు అభినందించారు.

గురుకులం సందర్శన



మాట్లాడుతున్న జెడ్పీటీసీ నర్సయ్య

ముస్తాబాద్: స్థానిక సాంఘీక సంక్షేమ ఎస్సీ బాలుర గురుకుల విద్యాలయాన్ని జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి సోమవారం సందర్శించారు. విద్యార్థుల భోజనాలను పరిశీలించారు. నీటి వసతి ఇతర సదుపాయాల తీరును అడిగి తెలుసుకున్నారు. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. తాగునీటికి సంబంధించిన వాటర్ ప్లాంట్ సరిగా పనిచేయడం లేదని, దానిని బాగు చేయిస్తామన్నారు.

ఈ బడి తలుపులు తెరవరా?

వేములవాడఅర్బన్: ఒకవైపు ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేస్తోంది. కాని ఒక గ్రామంలో అన్ని వసతులున్న ఒక పాఠశాల నిర్మించి ఏకంగా ఆరేళ్ల పాటు ఏ కారణం లేకుండా ప్రారంభించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఈ పాఠశాల ప్రారంభానికి నోచుకోకపోవడానికి కారణాలేమైనా ఈ గ్రామంలో బడీడు పిల్లలు మాత్రం ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రయివేటు పాఠశాలలకు తప్పని పరిస్థితుల్లో తమ పిల్లలను పంపిస్తున్న పేదవారు ఫీజులు కట్టలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలను ప్రారంభిస్తే తమ పిల్లలను పంపిస్తామని గ్రామస్తులు అంటున్నారు.



నిరుపయోగంగా కొడుముంజ ప్రభుత్వ పాఠశాల

- అన్ని వసతులతో నిర్మించి.. వదిలేశారు
- తీర్మానం కాపీ పేరుతో ఆరేళ్లుగా ఎదురుచూపు
- అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి నిలువుటద్దం
- ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయిస్తున్న విద్యార్థులు
- ప్రారంభించాలని వేడుకోలు

నిరుపయోగంగా పాఠశాల

వేములవాడ మండలం కొడుముంజ పాత గ్రామం మిడ్‌మానేరు ముంపునకు గురికావడంతో నాంపల్లి శివారులో కొడుముంజ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఏర్పాటు చేశారు. ఈ కాలనీలో సుమారుగా 320 ఇళ్లు, 2 వేల జనాభా ఉంటుంది. బడీడు పిల్లలు సుమారుగా 100 మంది ఉంటారు. గ్రామంలో ఆరేళ్ల క్రితం ఆరు గదులతో కొత్తగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని నిర్మించారు. కాని ఆ పాఠశాలను ప్రారంభించాలనే ఆలోచన విద్యాధికారులు చేయలేదు. దీంతో ఈ గ్రామంలోని పిల్లలు చదువుకు దూరమయ్యారు. ఈ పరిస్థితిలో ప్రైవేట్ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించారు. ఈ పాఠశాలలో ఒక గదిలో రేషన్ బియ్యం పంపిణీ చేసేందుకు కేటాయించారు. మిగతా గదులు మాత్రం ఎన్నికలు సమయంలో శుభ్రం చేసి పోలింగ్ కోసం వినియోగిస్తున్నారు. గ్రామస్తులంతా కలిసి సర్పంచ్ సమక్షంలో పాఠశాలను ప్రారంభించాలని తీర్మానం చేసి, తీర్మానం కాపీ తమకు అందిస్తే పాఠశాల ప్రారంభిస్తామని మండల విద్యాధికారి అంటుండగా, ఎన్నోసార్లు పాఠశాల ప్రారంభించేందుకు ఉపాధ్యాయులను కేటాయించాలని ఎన్నిసార్లు విద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని సర్పంచ్ తెలిపాడు. అయితే గ్రామంలో పాఠశాల తెరిచేందుకు బాధ్యత వహించాల్సిన అధికారులు,



పాఠశాల గదిలో రేషన్ దుకాణం

ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో పాఠశాల మూలకు పడింది. అయితే పాఠశాల భవనంలోని ఒక గదిని రేషన్ షాపు డీలర్‌కు ఐదు సంవత్సరాలుగా కేటాయించడంపై కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ గదిని అద్దెకిచ్చారా.? ఇస్తే ఆ డబ్బులు ఏమైనట్లు.? పాఠశాల ప్రారంభించపోవడానికి మరేమైనా కారణాలున్నాయా అనే విషయాలపై వివిధ రకాలుగా చర్చించుకుంటున్నారు.

ఫీజులు భారంగా మారాయి

ప్రభుత్వ పాఠశాల అందుబాటులో లేక గ్రామంలోని నిరుపేదలు సైతం తమ పిల్లలను వేములవాడ, శాంతినగర్ ప్రయివేట్ పాఠశాలకు తప్పని పరిస్థితుల్లో పంపాల్సి వస్తోంది. కాని ప్రయివేట్‌లో అధిక ఫీజులు కట్టలేని పరిస్థితిలో ఆర్థికంగా చితికిపోతున్నారు. కొంతమంది తమ పిల్లలను పాఠశాలకు పంపలేక తమతో పాటు కూలి పనులకు తీసుకెళుతున్నారు. అధికారులు పట్టించుకుని ఇప్పటికైనా ప్రభుత్వ పాఠశాలను ప్రారంభించాలని కోరుతున్నారు.

ఫీజులు కట్టలేకపోతున్నం



మా బాబు మూడో తరగతి చదువుతున్నాడు. గ్రామంలో పాఠశాల లేక వేములవాడలోని ప్రయివేటు పాఠశాలకు పంపిస్తున్నా. ఆటో, పాఠశాల ఫీజు కట్టలేకపోతున్నం. గ్రామంలో పాఠశాల ప్రారంభించాలి.
– బుర మల్లయ్య, కొడుముంజ

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ప్రభుత్వ పాఠశాలను ప్రారంభించాలని గతంలో కూడా అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. కాని ఎవరూ స్పందించలేదు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని పాఠశాలను ప్రారంభించాలి.
– పొన్నం ప్రశాంత్, వేములవాడ

తీర్మానానికి సిద్ధంగా ఉన్నాం



ప్రభుత్వ పాఠశాల ప్రారంభించేందుకు ఉపాధ్యాయులను పంపించాలని అనేక సార్లు కోరాం. ఉపాధ్యాయులను పంపిస్తే పాఠశాల ప్రారంభించేందుకు పంచాయతీ తీర్మానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం.
– కదిరె రాజు కుమార్ సర్పంచ్, కొడుముంజ

తీర్మానం ఇస్తే ప్రారంభిస్తాం



పాఠశాలను ప్రారంభించాలంటే గ్రామంలోని పిల్లల తల్లిదండ్రుల సమక్షంలో గ్రామ సర్పంచ్ గ్రామ పంచాయతీ తీర్మానం చేసి ఇస్తే పాఠశాలను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నాం.
– భూక్య బన్నాజీ, ఎంఈవో, వేములవాడ

నిరసనల వెల్లువ





గంభీరావుపేట, ముస్తాబాద్‌లో కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను ఊరేగిస్తున్న సంఘం నాయకులు

ముదిరాజ్‌లను అవమానించిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని జిల్లాలోని పలు మండలాల్లో ముదిరాజ్ కులస్తులు ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మతో సోమవారం డప్పుచప్పుళ్ల మధ్య శవయాత్ర నిర్వహించి దహనం చేశారు. కౌశిక్‌రెడ్డిని ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్ మహసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు పర్శ హన్మండ్లు, మండల అధ్యక్షులు రమేశ్, పిట్ల రాంగోపాల్, మాజీ ఎంపీటీసీ గజ్జెల రాజు, నాయకులు పాల్గొన్నారు. – ఇల్లంతకుంట/గంభీరావుపేట/చందుర్తి/ముస్తాబాద్

మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం



సిరిసిల్లలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ కళ



బోయినపల్లిలో అవగాహన ర్యాలీ

సిరిసిల్లటౌన్: మాదక ద్రవ్యాల నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రాల్లో సోమవారం ర్యాలీలు, పోస్టర్ల ఆవిష్కరణ, అవగాహన సదస్సులు నిర్వహించారు. జిల్లా మహిళ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, షీటీం ఏఎస్సై ప్రమీల పాల్గొన్నారు.

వేములవాడరూరల్: వేములవాడ మండలంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలో తహసీల్దార్ మధుసుదన్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మజ, సంతోషిణి, సెస్ డైరెక్టర్ నారాయణరావు, ఏఎస్సై ప్రభాకర్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పడిగెల మానస, డీసీపీవో స్వర్ణలత, ఎంపీడీవో లచ్చాలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుస్మిత, ఆర్‌ఐ మధు, చైల్డ్‌లైన్ టీమ్ మెంబర్ మౌనిక, చీర్లవంచ సర్పంచ్ రవీందర్ పాల్గొన్నారు.

బోయినపల్లి: మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, తహసీల్దార్ నరేశ్, ఎస్సై మహేందర్, సర్పంచ్ లతశ్రీ, ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి, ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి, ఎంఏవో ప్రణిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల పాల్గొన్నారు.

చందుర్తి: మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీ ఎస్సై రమేశ్, ఎంపీడీవో రవీందర్, డిప్యూటీ తహసీల్దార్ లీలారాణి, ఆర్‌ఐ రవీందర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ, ఏపీఎం రజిత పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండల కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రేణుక, తహసీల్దార్ తఫాజుల్ హుస్సేన్, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో నరేశ్‌కుమార్, ఎంపీటీసీ అరుణ్‌కుమార్, ఎస్సై నవత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, తహసీల్దార్ జయంత్‌కుమార్, ఎంపీడీవో చిరంజీవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ సరిత, కళావతి, ఎక్సైజ్, పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

రుద్రంగి: మండల తహసీల్దార్ కార్యాలయంలో పోస్టర్‌ను అధికారులు ఆవిష్కరించారు.

రిటైర్డ్ ఉద్యోగుల బిల్లులు వెంటనే చెల్లించాలి



వినతిపత్రం అందిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

వేములవాడఅర్బన్: పదవీ విరమణ పొందిన ఉద్యోగుల బిల్లులు వెంటనే చెల్లించాలని వేములవాడ తహసీల్దార్ కార్యాలయంలోని డిప్యూటీ తహసీల్దార్ శ్రవణ్‌కుమార్‌కు సోమవారం రిటైర్డ్ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షనర్ నుంచి కమ్యూనికేషన్ ద్వారా పొందిన మొత్తాన్ని 15 నుంచి 12 ఏళ్లకు తగ్గించాలని కోరారు. పీఆర్సీ కోసం కమిటీ వేసి వచ్చే జూలై నుంచే పరిగణలోకి తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులు తక్షణమే చెల్లించి ప్రతినెల 6 లోపు పెన్షన్ ఇచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వేములవాడ పెన్షనర్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాజేశం, ప్రధాన కార్యదర్శి చల్లా సత్తయ్య, రాధాకిషన్, సాంబశివరావు, సత్యనారాయణ ఉన్నారు.

పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేములవాడ: వేములవాడ పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెస్ ఏఈ సుష్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాలానగర్, లక్ష్మీపూర్, లాలపల్లి, కట్టకింది బస్టాండు, గోశాల ఏరియా, పాత ఆంధ్రాబ్యాంకు, జాత్రాగ్రౌండ్, వాసవీనగర్, రాంమందిరం వీధి, న్యూఅర్బన్‌కాలనీ, రాజీవ్‌నగర్, చెక్కపల్లి రోడ్డు, అంజనీనగర్, సాయినగర్, విద్యానాగర్, మల్లారంరోడ్డు, మార్కండేయనగర్, పాపన్నచౌక్, భగవంతరావునగర్, మున్సిపల్ ఆఫీస్ ఏరియా, భీమేశ్వరాలయం వీధి, పార్వతీపురం, కాలేజ్‌రోడ్డు, బద్దిపోచమ్మవీధి, హన్మక్కపల్లి, జయవరం ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయానికి సెస్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సిరిసిల్లలో..

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేట రహదారి నిర్మాణ పనులు జరుగుతున్నందున ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ మధుకర్ ఒక ప్రకటనలో తెలిపారు. వెంకంపేట, పాత బస్టాండ్, సంజీవయ్యనగర్, ఆటోనగర్, ఆసిఫ్‌పుర, అశోక్ నగర్, తదితర ప్రాంతాల్లో కరెంట్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

నియామకం

మహిళ కాంగ్రెస్ మండల అధ్యక్షురాలిగా మంజుల

వీర్నపల్లి: మండల మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా జోగుల మంజులకు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్ సోమవారం నియామక పత్రాన్ని అందజేశారు.

పాఠశాలల బంద్



సిరిసిల్లలో..



ఎల్లారెడ్డిపేటలో..

విద్యారంగంలో సమస్యల పరిష్కారం కోరుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన పాఠశాలల బంద్ కార్యక్రమం జిల్లాలో విజయవంతమైంది. ఏబీవీపీ నాయకులు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలను బంద్ చేయించారు. ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేని రంజిత్‌కుమార్, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు ధరంసోత్ ప్రకాశ్‌నాయక్, తిరుపతి, ఏబీవీపీ మండల కన్వీనర్లు పూజం కార్తీక్, బీజేవైఎం మండల అధ్యక్షుడు కోల ఆంజనేయులు, ఏబీవీపీ (ఎస్ఎఫ్‌డీ) కరీంనగర్ విభాగ్ కన్వీనర్ సామనపెల్లి ప్రశాంత్ పాల్గొన్నారు.
– సిరిసిల్లటౌన్/ఎల్లారెడ్డిపేట/ఇల్లంతకుంట/ముస్తాబాద్/కోనరావుపేట/గంభీరావుపేట/తంగళ్లపల్లి


వ్యాయామవిద్య ప్రవేశపరీక్షలో ఈశాన్యకు 9వ ర్యాంకు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పద్మజ

వేములవాడఅర్బన్: వ్యాయామ విద్య ప్రవేశపరీక్షలో వేములవాడ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ పద్మజ తెలిపారు. ఈశాన్య 9వ ర్యాంక్ సాధించగా, నికిత 216, సంధ్య 261, అన్వేష 808, ఎస్.సంధ్య 887, హరిత 1079, శ్రీపూజ 1119 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను వైస్‌ప్రిన్సిపాల్ శ్యామల, అధ్యాపకులు అభినందించారు.

వర్గీకరణ చేపట్టాలి



మాట్లాడుతున్న దేవరాజు

కోనరావుపేట: ఏబీసీడీల వర్గీకరణ సాధనకు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి తంగళ్లపల్లి దేవరాజు కోరారు. కోనరావుపేట మండలం ధర్మారంలో సోమవారం జరిగిన ఎమ్మార్పీఎస్ సమావేశానికి హాజరై మాట్లాడారు. జూలై 6న హైదరాబాద్‌లో చేపట్టే మహాసభను విజయవంతం చేయాలని కోరారు.

విద్యావలంటీర్లను నియమించాలి

సిరిసిల్లక్రైం: ప్రభుత్వ పాఠశాలలో పెరిగిన విద్యార్థులు సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడంతోపాటు అవసరమైన విద్యాలయాల్లో విద్యా వలంటీర్లను నియమించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాస్‌రావు అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ విద్యాలయాల్లో మౌలిక వసతుల కల్పన, పదో తరగతి ఫలితాలు మెరుగ్గా రావడంతో విద్యార్థులు ప్రైవేటు నుంచి ప్రభుత్వ విద్యాలయాల్లోకి వచ్చారని, అలాంటి విద్యార్థులకు సజావుగా విద్యనందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. పాఠశాలలో పారిశుధ్య పనులకు కావాల్సిన నిధులను విడుదల చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యద[illegible] కిషన్, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

ఆసరా పింఛన్లలో అవకతవకలపై కలెక్టర్‌కు ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కొండయ్య

వేములవాడరూరల్: ఆసరా పెన్షన్, దివ్యాంగుల సర్టిఫికెట్లతో కొంతమంది ప్రభుత్వాన్ని మోసం చేస్తూ పెన్షన్ పొందుతున్నారని వేములవాడ మండలంలోని నాగాయపల్లి గ్రామానికి చెందిన బండి కొండయ్య కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఎలాంటి అంగవైకల్యం లేకున్నా సర్టిఫికెట్లు పొంది ప్రతీ నెల పింఛన్ పొందుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వెంటనే వీటిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుని పొందిన పెన్షన్ రికవరీ చేయాలని కోరారు. కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు కూడా పెన్షన్, రేషన్ బియ్యాన్ని పొందుతున్నారని వీటిపై కూడా గ్రామంలో పూర్తి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

కొనుగోళ్లలో అవకతవకలు



కలెక్టరేట్‌కు వచ్చిన బాధిత రైతులు

సిరిసిల్లఅర్బన్: ధాన్యం కొనుగోళ్లలో తరుగు పేరిట అవతవకలు జరిగాయని, న్యాయం చేయాలంటూ బోయినపల్లి మండలానికి చెందిన రైతులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఏఎంసీ డీసీఎంఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన కొనుగోళ్లలో తరుగు పేరిట బస్తాకు నాలుగు కిలోల వరకు దోపిడీ చేశారన్నారు. రైస్‌మిల్లర్లు మరింత కోత విధించారన్నారు. డబ్బులు ఖాతాలో జమయ్యే వరకు కోత విధించిన విషయం తమకు తెలువలేదన్నారు. చర్యలు తీసుకోవాలని కోరారు.

ధాన్యం డబ్బులు జమ చేయాలి



కోనరావుపేటలో ఆందోళన చేస్తున్న రైతులు

కోనరావుపేట: గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించి నెల రోజులు దాటుతున్నా డబ్బులు రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కోనరావుపేట మండల కేంద్రంలో రైతులు మాట్లాడుతూ డబ్బులు రాకపోవడంతో పంటల పెట్టుబడుల కోసం అవస్థలు పడుతున్నామన్నారు. చైర్మన్ బండ నర్సయ్యను వివరణ ఇస్తూ కామారెడ్డిలోని మిల్లులకు పంపడం వల్ల ఆలస్యం అయిందని, పర్మిషన్ వచ్చిందని, రెండు రోజుల్లోగా జమ అవుతాయన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడి



బెల్లం పానకాన్ని పారబోస్తున్న ఎక్సైజ్ పోలీసులు

రుద్రంగి: మండలంలోని హనుమాన్‌తండా, సర్పంచ్‌తండా, బడితండా, అడ్డబోరుతండా గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. గుగులోత్ హంసి, గుగులోత్ నిర్మల, గుగులోత్ రుకిబాయి, లకావత్ పద్మలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

బాధ్యతలు తీసుకున్న తహసీల్దార్

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండల తహసీల్దార్‌గా విజయలలిత సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక కానీ, మట్టిని కానీ తరలించవద్దని, ఒకవేళ తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఇల్లంతకుంట: మండలంలోని కందికట్కూర్ గ్రామంలో నలుగురు లబ్ధిదారులకు సోమవారం సర్పంచ్ ముత్యం అమర్‌గౌడ్ కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు.ఉపసర్పంచ్ శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీటీసీ తిరుపతి, తదితరులున్నారు.

నేడు ఆర్టీసీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

సిరిసిల్లఅర్బన్: టీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ‘ఒకరి రక్తదానం–ముగ్గురికి ప్రాణదానం’ అనే కార్యక్రమంలో భాగంగా సిరిసిల్ల ఆర్టీసీ డిపోలో మంగళవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 99592 25929 నెంబర్‌ని సంప్రదించాలన్నారు.

సాహూ మహరాజ్ జయంతి

చందుర్తి: స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఛత్రపతి సాహూ మహరాజ్ 149వ జయంతి వేడుకలను ప్రధానోపాధ్యాయులు విక్రుర్తి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ఇంకుడుగుంతల పరిశీలన

ఇల్లంతకుంట: మండలంలోని గొల్లపల్లి, కేశన్నపల్లి గ్రామాల్లో సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణాలను ఏపీవో చంద్రయ్య పరిశీలించారు.

ఇంటింటికీ బీజేపీ

వీర్నపల్లి: మండల కేంద్రంలో 11వ బూత్ అధ్యక్షుడు మాడుగుల లింబాద్రి ఆధ్వర్యంలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో కాజీబాబు, వినోద్, కళ్యాణ్ పాల్గొన్నారు.

నేటి నుంచి పదిరకు ఆర్టీసీ బస్సు



బస్సు పాసుల కోసం విరాళం అందిస్తున్న సర్పంచ్

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పదిర గ్రామానికి మంగళవారం నుంచి ఆర్టీసీ బస్సు సేవలు ప్రారంభంకానున్నాయి. మండలంలోని వెంకటాపూర్, హరిదాస్‌నగర్, పదిర, రాగట్లపల్లి, ఎల్లారెడ్డిపేట మీదుగా వీర్నపల్లి మోడల్‌స్కూల్ వరకు ఈ బస్సు నడవనుంది. ఇన్నాళ్లు పదిర గ్రామం నుంచి మోడల్‌స్కూల్‌కు రెండు ఆటోల ద్వారా విద్యార్థులు వెళ్లి, వస్తున్నారు. ఈ విషయాన్ని సిరిసిల్ల ఆర్టీసీ డిపో ఎస్టీఐ సారయ్య, విలేజ్ బస్సు ఆఫీసర్ రాంరెడ్డి నాయక్ దృష్టికి మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాల్‌రాజ్ యాదవ్ తీసుకెళ్లారు. ఆర్టీసీ అధికారులు సోమవారం గ్రామానికి చేరుకుని విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. విలేజ్ బస్ ఆఫీసర్ రాంరెడ్డినాయక్ మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 7.20 గంటలకు పదిర గ్రామంలోకి బస్సు వస్తుందని వీర్నపల్లిలో 8.30 గంటలకు చేరుకుంటుందని, సాయంత్రం 5.30 గంటలకు వీర్నపల్లి నుంచి బయలుదేరి 6.10 గంటలకు పదిరకు చేరుకుంటుందని వివరించారు. విద్యార్థుల బస్సుపాస్ కోసం సర్పంచ్ వజ్రమ్మ రూ.5 వేలు విరాళంగా అందించారు. సమావేశంలో ఎల్లారెడ్డిపేట మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజుయాదవ్, జవ్వాజి మహేందర్, కమలాకర్, రేపాక రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.